క్లుప్తంగా

తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్తులు



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గాండ్లపెంట: మూడు నెలలుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోలేదంటూ రెక్కమాను గ్రామస్తులు శుక్రవారం కదిరి–రాయచోటి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు రోడ్డు విస్తరణ పనులు పూర్తవుతానే పైపులైన్ వేస్తామని చెప్పారన్నారు. అయితే రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి మంచి నీటి పైపులైన్ మరమత్తులు చేసి నీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్ తొలగించడంతో సమస్యల తలెత్తిందన్నారు. రెండు రోజుల్లోగా నూతన పైపులైన్ వేసి నీటి ఎద్దడి తీరుస్తామని చెప్పడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

మల్బరీ సాగు లాభదాయకం

బత్తలపల్లి: మల్బరీ సాగు రైతులకు లాభదాయకంగా ఉంటుందని పట్టు పరిశ్రమ ఏడీ అప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం వేల్పుమడుగు, పోట్లమర్రి, అనంతసాగరం గ్రామాల్లో ఆయన సెరికల్చర్ అధికారి దామోదర్‌రెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ మస్తాన్‌రెడ్డి, అసిస్టెంట్ ముత్యాలప్పతో కలిసి పర్యటించారు. ఆయా గ్రామాల్లో మల్బరీ తోటలు, పట్టుపురుగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మల్బరీ ఎలా సాగు చేయాలి, దిగుబడి ఎలా తీయాలి, తెగుళ్ల నివారణ పద్ధతులను రైతులకు వివరించారు. రైతులను ప్రోత్సహించేందుకు వివిధ రాయితీలను ప్రభుత్వం ఇస్తోందని వివరించారు.

తప్పిన ప్రమాదం

ముదిగుబ్బ: విద్యుత్ స్తంభం ఒరిగిన ఘటనలో ప్రమాదం తప్పింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ స్తంభం ఒరిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన విద్యుత్‌శాఖ సిబ్బంది రవి, ప్రకాష్, మహేష్ తదితరులు విద్యుత్ సరఫరా ఆపేసి స్తంభాన్ని సరిచేశారు.

చెత్త నుంచి ఎరువు తయారు చేయండి



వానపాములను వదులుతున్న అధికారులు

బత్తలపల్లి: ఇంటింటి నుంచి పొడి చెత్త, తడి చెత్తను సేకరించి తద్వారా ఎరువును తయారు చేసుకొని విక్రయించాలని డీఎల్‌పీఓ శివకుమారి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని' ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సంపద తయారీ కేంద్రం నిర్వహణపై కార్యదర్శి నారాయణస్వామిని అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రెండు బిడ్లల్లో సేంద్రీయ ఎరువు తయారీ కొరకు వానపాములను వదిలారు. వీటి ద్వారా సేంద్రీయ ఎరువును తయారు చేసుకొని రైతులకు విక్రయించాలని సూచించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, వర్మీ సేల్స్ మెన్ రమేష్ పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను అందిస్తున్న వేణుగోపాల్

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి సమక్షంలో పల్లెం వేణుగోపాల్ విద్యార్థినుల కోసం కంప్యూటర్‌ను వితరణగా అందించారు. విద్యార్థినులకు ఉపయోగపడేలా కంప్యూటర్ అందించామని దాత తెలిపారు. కళాశాల కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



వాసవీక్లబ్ నూతన కమిటీ సభ్యులు

కదిరి అర్బన్: పట్టణంలో శుక్రవారం వాసవీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్‌గా సతీష్‌కుమార్, సెక్రటరీగా నాగేంద్ర, ట్రెజరర్‌గా వెంకటేష్ గుప్తా, వైస్ గవర్నర్‌గా ద్వన్వీత్ అగర్వాల్, జోనల్ చైర్మన్‌గా మురళీమోహన్‌లను ఎన్నుకున్నారు.



వ్యవసాయ కూలీలతో కిక్కిరిసిన ఆటో



దేవిరెడ్డిపల్లి వద్ద ఆటో అంచున కూర్చుని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

ప్రమాదకర ప్రయాణం

- పలు పల్లెలకు ఆర్టీసీ సౌకర్యం నిల్
- విద్యార్థులు, కూలీలకు ప్రైవేట్ వాహనాలే దిక్కు
- బస్సులు నడపాలని జనం వేడుకోలు

నల్లచెరువు: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం. అయితే కొన్ని పల్లెలకు బస్సు సౌకర్యం లేదు. ఆటోలు, బొలెరో, ట్రాక్టర్లు తదితర వాహనాలే దిక్కయ్యాయి. ప్రైవేట్ వాహనదారులు ఆదాయం కోసం పరిమితికి మించి తరలిస్తుండటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలోని పంతులచెరువు, తవళంమర్రి, మద్దిమడుగు, ఉబిచర్ల మీదుగా ఆర్టీసీ బస్సులు లేవు. ఈ మార్గంలో నిత్యం విద్యార్థులు, కూలీలు ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణిస్తుంటారు. వేగంగా వెళ్లినపుడు మలుపుల వద్ద, స్పీడ్‌బ్రేకర్ల వద్ద సడన్ బ్రేకు వేస్తే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం లేకపోలేదు.

పట్టించుకోని అధికారులు

ప్రైవేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటే ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్లే సమయంలో పొగమంచుతో దారి కానరావడం లేదు. ప్రమాదాలు జరగకుముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మండలంలోని పంతుల చెరువు, తవళంమర్రి, మద్దిమడుగు, ఉబిచర్ల గ్రామాల మీదుగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని తల్లిదండ్రులు, పలు గ్రామాల జనం కోరుతున్నారు.



జాతీయ రహదారిపై పొగమంచులోనే వేగంగా వెళుతున్న ఆటో

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



జిల్లా చేనేత, జౌళి కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

పుట్టపర్తి టౌన్: ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులతో కలసి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ విధించడంతో చేనేత రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. దీంతో కార్మికులకు ఆకలిచావులు, ఆత్మహత్యలు తప్పడం లేదన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం నేతన్న నేస్తం, షెడ్లు, సహకార సంఘాలతో చేనేతలను ఆదుకుందన్నారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని 200 యూనిట్లు ఉచిత కరెంట్ అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినా నేటికీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలకు రూ. 2000 వేల కోట్లు కేటాయించడంతోపాటు జీఎస్టీ ఎత్తివేయాలన్నారు. 200 యూనిట్లు ఉచిత కరెంట్, పావలావడ్డీకి రుణాలు ఇవ్వాలి, 30శాతం రిబేట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బోగస్ చేనేత సహకార సంఘాలు రద్దు చేయాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీ శివరామకృష్ణకు అందజేశారు. సీపీఎం నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, జంగాలపల్లి పెద్దన్న, చేనేత కార్మిక సంఘం నేతలు రమణ, మారుతి, శీలా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాబ్‌మేళాలో 62 మందికి ఉద్యోగాలు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 62 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 145 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 62 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత తెలిపారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి తేజ్ కుమార్‌రెడ్డి, కో ఆర్డినేటర్ నాగార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలి

కదిరి అర్బన్: బీసీ సంక్షేమ శాఖ అధికారులు విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలని బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక రోడ్లు భవనాల అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. నెల రోజులుగా పలు సంఘాలు బీసీ హాస్టళ్ల అధికారులపై విమర్శలు చేయడానికి బీసీ సంక్షేమ శాఖ అంతర్గత లోపాలే కారణమన్నారు. జిల్లాలో సుమారు 60 దాకా బీసీ వసతిగృహాలు ఉన్నాయని అందులో సుమారు 10 వేల మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. బీసీ సంక్షేమ శాఖలో అందరూ ఒక్కటిగా పని చేయాలని కోరారు. సమావేశంలో బీసీ ప్రచారకమిటీ రాష్ట్ర కార్యదర్శి జయకుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆర్టీసీ డ్రైవర్ మృతి

కదిరి అర్బన్: నడింపల్లిలో శుక్రవారం అనారోగ్యంతో ఆర్టీసీ డ్రైవర్ బీఎస్ రెడ్డి మృతి చెందారు. డీఎం మైనోద్దీన్, ఎస్‌టీఎఫ్ పెద్దన్న, ఎంఎఫ్ రామకృష్ణ, క్రిష్ణయ్య, ఈయూ నాయకులు నబీరసూల్, జీవైపీ రావ్, ఆర్‌ఎస్‌రెడ్డి గ్రామానికి చేరుకుని బీఎస్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బీసీ వెల్ఫేర్ అధికారిణిపై ఆరోపణలు తగవు

కదిరి అర్బన్: బీసీ వెల్ఫేర్ అధికారిణి నిర్మలాజ్యోతిపై ఆరోపణలు తగవని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉద్యోగులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వారి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే కొందరు ఉద్యోగుల ప్రమేయంలో కొందరు ఆమెపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. దళిత ఉద్యోగుల పట్ల వారు వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని హెచ్చరించారు. తీరు మార్చుకోకపోతే తగిన రీతిలో బుద్ధి చెప్పడానికి వెనుకాడబోమన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్, కదిరి అధ్యక్షులు శ్రీనివాసులు, వేమనారాయణ, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో వాహనాలు నడపండి

బత్తలపల్లి: అప్రమత్తతతో వాహనాలు నడపాలని ధర్మవరం ఆర్టీఓ రాణి, ఎస్ఐ సోమశేఖర్ వాహనదారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి సమీపంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. 18 సంవత్సరాలలోపు మైనర్లు వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కేసు నమోదు

కదిరి టౌన్: దాడి ఘటనలో పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎర్రగుంటపల్లికి చెందిన మునీ తోటలో కళింగర కాయలు దొంగిలించాడని మున్సిపల్ పరిధిలోని జగనన్న కాలనీకి చెందిన షేక్ షానవాజ్‌తో ముగ్గురు వ్యక్తులు గొడవ పెట్టుకున్నారు. ఈక్రమంలో షేక్ షానవాజ్‌తోపాటు అతడి భార్యపై శుక్రవారం రాత్రి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

చిట్ అసిస్టెంట్ మేనేజర్‌పై దుర్భాషలు..

పట్టణంలోని శ్రీరఘువరన్ చిట్స్‌లో తన స్నేహితుడైన టిఎస్.ఇదాయితుల్లాకు చిట్ తగలలేదని ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి చిట్ అసిస్టెంట్ మేనేజర్ యర్రం శెట్టి మహేశ్వర్‌పై దుర్భాషలాడి బెదిరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



కొక్కంటిలో విద్యార్థుల మానవహారం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ భువనేశ్వరి ఘనంగా నిర్వహించారు. దేశంలో బాలికల విద్య, పోషకాహారం, బాల్య వివాహాలు, చట్టపరమైన హక్కులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు చిట్టెమ్మ, త్రివేణి, షమీవుల్లా, గోపాల్‌నాయక్, కిరణ్‌కుమార్, పుష్పావతి, ఆనంద్, సరస్వతి పాల్గొన్నారు.

తాడిమర్రి: బాలికలతోనే సమసమాజ అభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలితమ్మ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఆమె ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆమె పాఠశాల నందు కిశోర బాలికలతో మానవహారం ఏర్పాటు చేశారు.

తనకల్లు: కొక్కంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారులు లోకేశ్వర్ రెడ్డి, ధర్మరాజు, హెచ్‌ఎం సుబహానుల్లా ఉన్నారు.

గాండ్లపెంట: కటారుపల్లి కస్తూర్బా పాఠశాల, మలమీదపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేశ్వరమారుతి పాఠశాల ఎస్ఓ దుర్గా, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, హెచ్‌ఈ విజయ్‌కుమార్, సీహెచ్‌ఓ రష్మీ, ఏఎన్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: స్థానిక కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై రోల్‌ప్లే ద్వారా వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబి, లక్ష్మీదేవి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: కుటుంబ భవిష్యత్తుకు బాలికలే మార్గదర్శకులని ఎనుములపల్లి వైద్యాధికారులు డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ భవ్య పేర్కొన్నారు. శుక్రవారం జగరాజుపల్లి కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవం, అంతర్జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీహెచ్ఓ నగేష్, ఎస్ఓ నాగసుప్రజ, ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే కుటుంబం రోడ్డుపాలు



హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వ్యక్తికి గులాబీ పువ్వు ఇస్తున్న అధికారులు

కదిరి అర్బన్: నిర్లక్ష్యంతో వాహనం నడిపి ప్రమాదానికి గురైతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఎంవీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ భద్రత మాసోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద రవాణా, పోలీస్, వైద్యశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్ హాజరయ్యారు. డ్రైవర్ల తప్పిదాలతోనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, మొబైల్‌లో మాట్లాడుతూ అతివేగంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రోడ్డు నిబంధనలు పాటిస్తున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద

పుట్టపర్తి టౌన్: పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద సచివాలయ సెక్రటరీలను ఆదేశించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇంటి పన్నులు రూ.2.4 కోట్లు వసూలు చేశామన్నారు. యూజీడీ అరియర్స్ డిమాండ్ రూ.2.32 కోట్లు ఉండగా రూ.14.4 లక్షలు వసూలయ్యాయని, ఇంకా రూ.2.18 కోట్లు బకాయి ఉందన్నారు. సచివాలయ సెక్రటరీలు పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ప్రజలను కోరారు.

కొక్కంటి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న డీఎల్‌ఏటీఓ తిప్పయ్య

తనకల్లు: మండలంలోని కొక్కంటి ప్రాథమికారోగ్య కేంద్రాన్ని డీఎల్‌ఏటీఓ తిప్పయ్య, డీపీఎంఓ రెడ్డికుమార్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. టీబీ వ్యాధిగ్రస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరైన వైద్య సేవలను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో లెప్రసీ సర్వే సక్రమంగా నిర్వహించాలని, కుష్టువ్యాధి సంబంధిత అనుమానిత కేసుల వివరాలను పక్కా నమోదు చేయాలన్నారు. డబ్ల్యూహెచ్‌ఓ టీబీ కన్సల్టెంట్ ప్రశాంత్‌కుమార్, వైద్యాధికారులు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, ఎంపీహెచ్‌ఓ ఓబులేసు, హెల్త్ సూపర్‌వైజర్లు సూర్యనారాయణరెడ్డి, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కదిరి అర్బన్: గాండ్లపెంట మండలం చిన్నమిట్టలో శ్రీధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బత్తల హరిప్రసాద్ రూ.1 లక్ష విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా ఆలయ కమిటీ సభ్యులకు పంపారు.

లేత జొన్న గడ్డి విషంతో సమానం

బత్తలపల్లి: లేత జొన్న గడ్డి గొర్రెలకు విషంతో సమానమని బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి అన్నారు. శుక్రవారం అప్పరాచెరువు, వెంకటగారిపల్లి గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈసందర్భంగా 79 పశువులకు చికిత్సలు, 22 పశువులకు గర్భకోశ చికిత్సలు అందించారు. 8,970 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలను అందించారు.

పొలాల్లో దొంగల హల్‌చల్

- పలుచోట్ల కేబుల్, డ్రిప్పు పరికరాల అపహరణ
- ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి ఆయిల్ చోరీకి విఫలయత్నం

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి, దాదులూరు, కుర్లపల్లి గ్రామాల సరిహద్దుల్లోని వ్యవసాయ పొలాల్లో నాలుగు రోజులుగా దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. బోరుబావుల వద్ద మోటార్లకు అమర్చిన కేబుల్, డ్రిప్పు పరికరాలు అపహరించారు. బుధవారం రాత్రి ఒకే రోజు మామిళ్లపల్లిలోని 10 వ్యవసాయ బోరుబావుల వద్ద కేబుల్‌ను కత్తిరించి తీసుకెళ్లడం సంచలనం రేకెత్తించింది. రైతులు కృష్ణారెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాసులు, నాగభూషణ... తమతమ బోరుబావులకు సుమారు 10 మీటర్ల వరకు కాపర్ కేబుల్‌ను ఏర్పాటు చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.25 వేల వరకు ఉంటుంది. వీటితో పాటు పొలాల వద్ద ఉన్న డ్రిప్పు పరికరాలు కూడా అపహరించడంతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి మామిళ్లపల్లి సమీపంలో వ్యవసాయ పొలాల వద్ద కాపాలాకు వెళ్లిన రైతులకు కొందరు అనుమానాస్పద వ్యక్తులు కనిపించడంతో గుట్టుచప్పుడు కాకుండా వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. అదే రోజు రాత్రి దాదులూరు వద్ద పొలంలో రైతు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని ఆయిల్, కాపర్ వైర్లను అపహరించే ప్రయత్నం చేశారు. ఈ లోపు రైతులు అక్కడకు చేరుకోవడంతో పారిపోయారు. ఆ సమయంలో వారు వెంట తెచ్చుకున్న పరికరాలు, బ్యాగులు అక్కడే పడేసి ఉడాయించారు. ఇప్పటికైనా పోలీసులు గస్తీ చేపట్టి చోరీలను అరికట్టాలని రైతులు కోరారు. కాగా, దీనిపై కనగానపల్లి ఎస్ఐ ఎం.రిజ్వాన్ మాట్లాడుతూ... పొలాల వద్ద చోరీలతో పాటు సమీప గ్రామాల్లో దొంగతనాలు అరికట్టేందుకు మామిళ్లపల్లి పోలీస్ చెక్‌పోస్టులో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎస్సీకాలనీలో పారిశుధ్య పనులు



కాలువలో పూడిక తీస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు ఇచ్చి, మురుగుకాలువలను శుభ్రం చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి నారాయణ స్వామి అన్నారు. ఎస్సీ కాలనీలో పారిశుధ్య లోపంపై శుక్రవారం 'సాక్షి'లో 'చెత్త కదలదు..మురుగు పారదు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప ఆదేశాల మేరకు కార్యదర్శి నారాయణ స్వామి పంచాయతీ సిబ్బందితో ఎస్సీ కాలనీలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. కాలనీలోని అన్ని కాలువలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది ప్రతి వారం కాలువల్లోని చెత్తను తొలగించేలా చూస్తామన్నారు. ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. కాలువలపై నిర్మాణాలు చేపట్టిన వారికి, బండలు వేసుకున్న వారికి నోటీసులు ఇచ్చి వాటిని తొలగిస్తామన్నారు.

కురుబ సంఘం యూత్ ప్రెసిడెంట్‌గా కోటి సురేష్‌కుమార్



కోటి సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు

బత్తలపల్లి: మండల కేంద్రానికి చెందిన దివంగత నేత కోటి గురుమూర్తి కుమారుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్‌ను కురుబ సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని శ్రీరామతులసీ కల్యాణ మండపంలో జరిగిన కనకదాస జయంత్యుత్సవాల్లో కురుబ సంఘం ఎన్నికలు జరిగాయి. ఇందులో తనను కురుబ సంఘం రాష్ట్ర యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నట్లు కోటి సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కురుబలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనను అభినందించారు.

'సుకన్య సమృద్ధి యోజన'పై అవగాహన



ఖాతా పత్రాన్ని అందిస్తున్న పోస్టుమాస్టర్

గాండ్లపెంట: స్థానిక తపాలా కార్యాలయంలో శుక్రవారం పోస్టుమాస్టర్ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి యోజన పథకంపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్లు వీరమారుతి, నారాయణ మాట్లాడుతూ 10 పదేళ్లలోపు బాలికల పేరు మీద తల్లి లేదా తండ్రి నామినిగా ఖాతా ప్రారంభించవచ్చన్నారు. రూ.250 నుంచి రూ.1.50 లక్షలు ఏడాదిలో డిపాజిట్ చేసే అవకాశం ఉందన్నారు. గ్రామీణ తపాలా సిబ్బంది బాబాఫక్రుద్దీన్, గాయత్రి, సరోజమ్మ, ఖాతాదారులు పాల్గొన్నారు.